

ఏళ్ల తరబడిపోయి బీళ్ళు పడిపోయిన నేలతల్లి నెర్రెలు తీసి మబ్బులు పట్టిన ఆకాశం గురించి కలలు కంటోంది. ఎక్కడ చూస్తే అక్కడ నెర్రెలకు తోడు బండలు నిలబడి ఉన్నాయి. రాయలసీమ పొలాలకు దీటుగా ఉన్నాయి. అక్కడి పొలాలు అని చెప్పుకుంటే ఒక్క వాక్యం సరిపోతుందేమో!

బండలలో ఒక బండలాగా ఉండవలసిన రత్తయ్య చైతన్యం పుంజుకున్నాడు. ఆకాశంలో నల్లమబ్బులు పట్టలేదు కాని... అక్కడకూడా తెల్లటి మబ్బులు ఏనుగుల మాదిరిగా కదలి వెళ్లిపోతున్నాయి.

తెల్లటి మబ్బుల తర్వాత నల్లటి మబ్బుల్లు కదలిరావన్న హామీ ఏమీ లేదు. అందుకే రత్తయ్య బలం పుంజుకున్నాడు. బండలను రెండు మొండి చేతులతోనూ ఎత్తి కట్టవ అవతలకు చేర్చుతున్నాడు. పొలంలోంచి బండలను తొలగించి పారేస్తే దుక్కి దున్నుకోవడం ఎంతసేపు?

చిన్నతనంలోనే ఒక ప్రమాదంలో రత్తయ్యకు చేతులు కత్తిరించి తీసేశారు. మోచేతుల వద్ద ఆకస్మాతుగా చేతులు అంతమైపోయి కండరాల మీద చర్మం ముడుచుకుపోయి వికృతంగా ఉంటాయి. బండలు ఎత్తుతున్నపుడు అవుతున్న రాపిడికి కండరాలు కొట్టుకుపోయి మొండి చేతులు రక్తాలు చిమ్ముతున్నాయి.





మొండి చేతులతో బండలను పట్టకారు పట్టినట్లు పట్టి ఎత్తి గుండెలకు హత్తుకుని కట్టవ వైపు నడుస్తాడు రత్తయ్య.

రెండు చేతులూ పూర్తిగా ఉన్నవాడి కంటె కూడా సమర్థవంతంగా పనిపాటలు చేసుకోగలడు రత్తయ్య. అయితే రత్తయ్యను యిటీవల నిరాశా నిస్పృహలల్లుకు పోయాయి. ఏళ్ళ తరబడి బీళ్ళు పడిపోయిన పొలాలు రైతులను నిర్వేదంలో ముంచెత్తాయి.

ఇదిగో, తెల్లటి మబ్బులయినా చాలా సంవత్సరాల తర్వాత ఆకాశంలో కనిపించి రత్తయ్యలో నూతన స్ఫూర్తిని రేకెత్తించాయి.

బండనెత్తాడు రత్తయ్య.

చేతి ఎముకలు కలుక్కుమంటున్నాయి. కండరాలు రాపిడికి బాధగా మూలుగుతున్నాయి. తగిలిన చోటే మరల తగులుతుందన్నట్టుగా రేగిన గాయాలే తిరిగి తిరిగి రేగుతున్నాయి. రేగిన చోటనల్లా రాతి అంచులు తగిలి గాయాలు పెద్దవవుతున్నాయి. బండరాతికి రత్తయ్య చేతులు రక్తధారలంటుతున్నాయి.

రత్తయ్య బాధగా మూలిగాడు.

బండరాతిని పళ్ళ బిగువున మోయాలని చూశాడు కాని బండరాయి జారిపోయి అతడి పాదాలకు ఒకే ఒక్క అంగుళం దూరంలో పడిపోయింది.

చావు తప్పి కన్నులొట్ట పోయినట్టయింది.

పాదాలు కూడా చితికి పోయి వుంటే

# ఓరి మనిషీ!

ఎమ్.వి.వి.సత్యనారాయణ

రత్తయ్య పూర్తి అవిటివాడైపోయాడు.

రత్తయ్యకు ఈ సందేహం వచ్చి వణికిపోయాడు. అతడి భార్య, ఒక్క కొడుకు గుర్తుకు వచ్చారు. తాను పూర్తి అవిటివాడైపోతే వాళ్లిద్దరూ అనాధలైపోతారు. రత్తయ్య రక్తాలు కారుతున్న తన చేతులు చూచి కళ్లనీళ్ళు పెట్టుకున్నాడు. పొలంలో యింకా చాలా బండరాళ్లున్నాయి.

ఇక తన వల్ల బండలను తొలగించడం సాధ్యం కాదు.

ఆకాశంలోకి చూశాడు రత్తయ్య. తెల్లటి మబ్బుల చివర తోకలాగా ఒకే ఒక్క నల్లటి మబ్బు తునక ప్రత్యక్షమయింది.

రత్తయ్యకు కళ్ళు చెదిరిపోయాయి

నిజంగానే నల్లటి మబ్బు!

రత్తయ్యలో తిరిగి స్ఫూర్తి ప్రవేశించింది.

నల్లటి మబ్బులు ఆకాశంలో గుమిగూడనున్నాయి. నల్లటి మబ్బులు కరుణించే సమయానికి తన పొలం దుక్కికి సిద్ధంగా వుండాలి. రత్తయ్య నీరసం జయించివేశాడు.

బండరాతిని సులువుగా లేపాడు. మొండి చేతులతో గుండెలకు హత్తుకున్నాడు. కట్టవ వైపు పరుగెత్తాడు. దక్షిణం వైపు నుండి చల్లటి గాలి కెరటం ప్రారంభమయింది.

ఎండ వేడిగాలుల తర్వాత సోకిన మొదటి మలయమారుతం.

కట్టవకు అటు ప్రక్కకు పడిపోయింది బండరాయి.

రత్తయ్య మరో బండరాతి కోసం బయలు దేరాడు.

ఆకాశంలో నల్లటి మబ్బులు గుమిగూడుతున్నాయి. నల్లటి ఏనుగుల్లాంటి మబ్బులు. మందల మందల నల్లటిమబ్బులు!

కలనికట్టుగా చాలా సంవత్సరాల తర్వాత!

ఒక వైపు ఆశ! మరొక వైపు పిచ్చి!

ఒకవైపు ఆత్రుత! మరో వైపు నిస్సహాయత!

రత్తయ్య విభిన్న ఆవేశాల మధ్య విచిత్రంగా ఊగిసలాడిపోయాడు. తాను ఈ జన్మకు బాగుపడగలడా! భగవంతుడు వర్షం కురిపిస్తున్నాడు. తనకు చేతులు లేకుండా చేసిన భగవంతుడు వర్షం కురిపించి నేల తల్లిని పులకింప చేస్తున్నాడు. అదే భగవంతుడు తనకు చేతులు యిచ్చి పుణ్యం కట్టు కోవచ్చు కదా!

ఆకాశం క్రమంగా నల్లబడ్తోంది.

దిక్కులన్నీ మూసుకుపోతూన్నట్టు- ఏనుగుల మంద దడికట్టినట్టు అతడి చుట్టూ తలమీద మబ్బుల పందిరి!

పుడమి తల్లి వేడెక్కిపోయి చినుకుల కోసం ఎదురుచూస్తోంది.

గాలి కెరటాలు మరింత చల్లగా వీస్తోన్నాయి.

రత్తయ్య చుట్టూ చూశాడు! రైతులు తావరతంపరలుగా పొలంల్లోకి దిగుతున్నారు. నేలను చదును చేసుకుంటున్నారు. పొలాల్లోని బండరాళ్ళను ఎత్తి పెట్టి అవతల పారేస్తూన్నారు.

దుక్కి దున్నడానికి వ్యవహారమంతా సజావుగా అమలు జరుగుతోంది.

రత్తయ్య బాధపడిపోయాడు!

తానే చెడిపోయాడు!

టప్...టప్...

పెదిమల మీద ఒక చినుకూ మొండి చేతి మీద మరో చినుకూ పడ్డాయి. అతడి కళ్లలోంచి చినుకుల్లాంటి కన్నీటి చుక్కలు కారడం ప్రారంభమయాయి.

వర్షపు చినుకులు తలమీద టపటపలాడాయి.

రత్తయ్యకు దుఃఖంతో కళ్లు తిరుగుతున్నాయి.

రత్తయ్య పుడమి తల్లి మీద కూలిపోయాడు.

***

నిద్రో - మెలుకువో-

కలో - కల్లో -

అవ్యక్తమైన భావన! శరీరమంతా తేలిపోతూన్నట్టు వింత అనుభూతి! మోచేతులు మీద ఒక రకమైన తిమ్మిరి!

అతడెవరు! రత్తయ్యకు ఎదుటి దిశలో వెలుగు వలయాల మధ్య రంగు రంగుల దుస్తులతో చేతిలో వదునైన ఆయుధంతో చిరునవ్వులొలుకుతూ ప్రత్యక్షమయాడు.

అతడి కళ్లలో కరుణ తొణికిసలాడ్తోంది.

మృదువుగా మాట్లాడాడు.

"చూచుకో... నీకు చేతులు మొలిచాయి. పోయి పని చేసుకో-"

రత్తయ్య మౌనంగా వింటున్నాడు.

మోచేతుల వద్ద కండరాల్లోంచి, ఎముకల్లోంచి, కొత్తకండరాలూ, కొత్త ఎముకలూ, జీవరక్తమూ, పొడుచుకువస్తోన్నట్టూ... చిమ్ముకొచ్చి చిమ్ముతూన్నట్టూ... గుండెల్లో కొత్త ఆనందం! వెన్నెముకలోంచి ఉత్తేజపు కెరటం చివ్వున దూసుకువస్తోంది.

రత్తయ్య పైకి లేవబోయాడు.

మొండి చేతులు తగల్లేద గాయాలు సలపలేదు. మనసులో ఆందోళన లేదు. గుండెల్లో ఆరాటం లేదు.

మనసంతా తేలిపోతున్నట్టు అవ్యక్తమైన అనుభూతి సముద్రం!

***

రత్తయ్య పూర్వపు మనిషి కాడు.

నాగలి పట్టి పొలం దున్నగలడు రెండు చేతులతో బండరాళ్లను సునాయాసంగా ఎత్తగలడు. వాటిని తనగుండె సపోర్ట్ లేకుండా కట్టవ అవతల పారెయ్యగలడు. తన తిండి తానే తినగలడు. బట్టలుతకడంలో వాటిని చెంగు ఇస్త్రీ చేయడంలో భార్యకు సహాయపడగలడు.

అంతా ఎందుకు!

సంసార జీవనంలో అతడికి లభించే సంతృప్తే మారిపోయింది.

మొండి చేతులకు చేతులు మొలిచాయి! ఆ వార్త కార్చిచ్చులా తెలుగుదేశంలో వ్యాపించిపోయింది.

శాస్త్రవేత్తలు విమానాల్లో పరుగెత్తుకు వచ్చి దిగబడ్డారు.

అధికారులు, అనధికారులు విలేకరులూ, ప్రయోగశాలా సిబ్బందీ మొత్తం ఆ గ్రామంలో దిగబడ్డారు. రత్తయ్య తరఫు బంధువులూ, అతడి ఆలి తరఫు ఆ

బంధువులు సైతం దిటి-

అందరి మొహాల్లోనూ ఆశ్చర్యం!

మొండి చేతులకు చక్కల్లా చేతులు మొలిచాయి.

ఇదెలా సాధ్యం?

ఏ దేవుడు గాని, ఏ బాబాగానీ, ఏ క్షుద్రదేవతగాని ఇంతటి అద్భుతాన్ని సాధించగలగడం ఇంతవరకూ కనీవినీ ఎరగని 'ఏద్భూరం! భక్తులు పూజలు చేస్తారు. నైవేద్యాలు సమర్పిస్తారు. తమకేదో మేలు జరగాలని ఆశిస్తారు.

మేలు జరుగుతుందని నమ్మేనమ్మరు.

కాని రత్తయ్యకు వేలు జరిగింది అద్భుతమైన మేలు! ఏభక్తుడికీ భక్తురాలికీ నమ్మశక్యంగానీ మేలు జరిగిపోయింది!

అవును - ఇదెలా సాధ్యం?


భక్తుల పరిస్థితి ఇలా వుంటే ఇక శాస్త్ర వేత్తల పరిస్థితి గురించి చెప్పనే అక్కరలేదు. ఏ శాస్త్ర ప్రయోగంతో చేతులు మొలిచాయి? మోచేతుల కింది భాగం, అరచేతులూ, వ్రేళ్ళూ, వ్రేళ్ళ చివరి గోళ్ళూ - అంతా సహజంగా అమర్చినట్టు అమరిపోయాయి.

నిజమే! ఇదెలా సాధ్యపడింది?

విలేకర్లకు చేతినిండా పని! పత్రికలు పతాక శీర్షికలు వెలువరించాయి. రత్తయ్య ఫోటోలు తెలుగుదేశం నలుచెరగులా వ్యాపించాయి. మహిమలు లేవనే వాళ్ళంతా నోళ్ళు మూసుకోవలసి వచ్చింది.

రత్తయ్యకు చేతులు మొలవడం మహిమకంటె అద్భుతమైన సంఘటన అయి ఉండాలని పత్రికలు రాశాయి. తెలుగు ఘోరదర్శన్, హిందీ దూరదర్శన్ పోటీలు పడి రత్తయ్యను టెలికాస్ట్ చేశాయి.

ఇదంతా కేవలం చేతులు మొలిచాక రెండు రోజుల వ్యవధిలో పరమాద్భుతంగా జరిగిపోయాయి. రత్తయ్యకు ఊపిరయితే సలపడం లేదుకానీ రెండు చేతులా




కావలసినంత పని! కావలసినంత డబ్బు! ఘోరదర్శన్, దూరదర్శన్ క్షణాలు లెక్కపెట్టి మరీ టెలికాస్టింగ్‌కి పారితోషికం చెల్లించాయి.

శాస్త్రవేత్తలు అతడి రక్తం పరిశోధించారు.

పెరిగిన కండరాలనూ, ఎముకలనూ రక్తాన్నీ అంచనా కట్టి నిగ్గు తేల్చారు. కొత్తగా మొలచుకు వచ్చిన కండరాల్లో ఇతర అవయవాల కండరాల పోగులే అచ్చుగా ఉన్నాయి. ఎముకల మూలుగు అంతే! రక్తం గ్రూపూ అంతే!

మహిమలు లేవని నోళ్ళు మనానుకున్న వ్యంగం జోడించి విమర్శనాస్త్రాలు సంధించారు. భగవంతుడికి కండరాలు ఎముకలూ రక్తమూ తయారు చేసే యంత్రాలున్నాయా అంటూఎద్దేవా చేశారు.

అయినప్పటికీ భక్తులు ఏ మాత్రమూ ఉడుక్కోలేదు. నవ్వితే నాప చేలే పండుతాయని కాబోలు వాళ్ల నమ్మకాలు! వాళ్లకి గానీ శాస్త్ర వేత్తలకుగానీ అర్థంకాని సమస్య ఒకే ఒకటి వుంది.

దేశంలో అంగవికలురు లక్షలాదిమంది ఉన్నారు.

రత్తయ్యకు ఒక్కడికే చేతులు మొలవడమేమిటి?

నిజానికి ఈ ప్రశ్నలు నాస్తికులు వేసిన ప్రశ్నల తాలూకా సారాంశాలు!

ఇంకేముంది? శాస్త్రవేత్తలు విజృంభించారు.

రత్తయ్యమీద ఆమూలాగ్రంగా పరిశోధనలు ప్రారంభించారు.

***

రత్తయ్యకు భుజాల వద్ద మొది ఉండలుతో కట్లుకట్టారు. అతడి కేటికి ఆహారం అందిస్తోంది రత్తయ్య భార్య. ఆమె కళ్ళలో నీళ్ళు చిప్పిలుతున్నాయి.

"ఏమండీ! మీరిలా అయిందేమిటండీ! మిమ్మల్ని ఈ స్థితిలో చూడలేకపోతున్నానండీ! ఏమండీ! మాట్లాడరేమండీ...

భార్య కన్నీళ్ళు తుడవలేకపోయాడు రత్తయ్య.

శాస్త్ర వేత్తలప్పుడే అతడి చేతులు రెండింటినీ భుజాల వద్ద కత్తిరించుకుపోయి పరిశోధనల మీద పడ్డారు.

"మరల దేవుడ్ని ప్రార్థించండి! చేతులు మొలుస్తాయేమో! అంది భార్య.

శాస్త్రవేత్తల పరిశోధనల్లో ఏమీ కొత్త విషయం తెలియలేదు. రత్తయ్యకు చేతులు తిరిగి అతకబోయారు.

సాధ్యపడలేదు.

అటు తర్వాత దేవుడు కూడా రత్తయ్యను పట్టించుకున్న దాఖలాలులేవు.

PRINTER & PUBLISHER: BHOGADI VENKATA RAYUDU,
Printed by him at 1-8-519/11, Chikkadapally,Hyderabad-500 020.
EDITOR: *Datla Narayana Murty Raju,* PHONES: 64104; 68806. No K-1038 / PRESS- SB / 35 / 89 .Dated 10-2-89